

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 71
## లీన్ సిక్స్ సిగ్మా

**మనలో చాలామందికి** అనుభవం అయిన విషయం చెప్పుకుందాం మరోసారి. మనం ఎటువంటి అద్భుతమైన కోర్సులు చేసాం, ఎలాంటి చదువులు ఎటువంటి యూనివర్సిటీలలో చేశాం అనేవి ఉద్యోగం వచ్చాక తేలిపోతాయ్. ఎందుకంటే చేసే ఉద్యోగానికీ చదివిన చదువుకీ దాదాపు సంబంధం ఉండదు. ఉన్నా అది కొన్నాళ్ళకి పనికిరాదు. ఉదాహరణకి ఇంజినీరింగ్ లో చదివే మెకానిక్స్, థర్మో డైనమిక్స్ అనేవి. మన దౌర్భాగ్యం ఏమిటంటే ఇప్పటికీ ఈ కోర్సులలో స్టీమ్ ఇంజన్ ఎలా పనిచేస్తుందీ దానికి కావల్సిన సూపర్ హీటెడ్ స్టీమ్ ఏమిటీ అంటూ క్లాసుల్లో అదరగొట్టి చెప్తూ ఉంటారు మనకి. తప్పదు కనక మనం నేర్చుకుంటూ ఉంటాం. పోనీయండి, మనకి అమెరికా రావడానికి ఉపయోగపడింది కదా ఆ డిగ్రీ కాయితమ్ముక్క? దాని సంగతి ఎందుకు ఇప్పుడు? అలా ఇంజినీరింగ్ డిగ్రీతో అమెరికా వచ్చిన త్రిపాఠీ గారికి కంపెనీలో ట్రైనింగ్ ఇస్తామన్నారు; దాని పేరు సిక్స్ సిగ్మా. అది చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందిట, త్రిపాఠీ గారు తెలివైన వాడు కనక ఈయన్ని కంపెనీ ఎంపిక చేశారు. పాఠాలు చెప్పేది జపాన్ నుంచి వచ్చి ట్రైనింగ్ ఇస్తున్న ఒకానొక జీరో సుజుకీ అనే ఆయన.

కోర్సులో చెప్పేది ఒకటే. సిక్స్ సిగ్మా అంటే కంపెనీలో చేసే ప్రతీ పనీ ఒక నిబద్ధతతో చేస్తూ వ్యర్థాలు తగ్గించడం, కంపెనీలో ఉన్న ఏయే పనుల వల్ల క్వాలిటీ లేదా వస్తు నాణ్యత పెరుగుతుందో వాటిని ఉంచి అభివృద్ధి చేయడం, వేటి వల్ల నాణ్యత పెరగడం లేదో వాటిని తొలగించడం. ఒక మిలియన్ లేదా పది లక్షల ఒకే మాదిరి వస్తువులు తయారు చేస్తే అందులో మూడు నుంచి నాలుగు వస్తువులు కంటే తక్కువ మాత్రమే పనికిరానివిగా ఉండొచ్చు. అంతకన్నా ఎక్కువ వస్తే ఎక్కడో వ్యర్థాలు, లేదా అతి ఖర్చులూ, పనికిరావి ఏవో ఉన్నాయి. అవి తొలగించాలి.  ఇదీ సుజుకీ గారు చెప్పేది. ఇది ఎప్పుడో ఎనభైలలో టయోటా కంపెనీ వారు రూపొందించారు. అప్పట్నుంచి ప్రాముఖ్యం సంతరించుకుంది.

త్రిపాఠీగారికి ఇది బాగా నచ్చేసి వంటబట్టించుకున్నాడు. ఆ కోర్సు లోనే సుజికీ గారితో తన కంపెనీలో జరిగే ఒక విషయం చెప్పి తాను ఎలా అందులో వ్యర్థాలని తగ్గించగలడో, దానివల్ల కంపెనీకి ఎంత లాభమో చెప్పాడు. సుజికీ గారు కూడా అద్భుతః అనేసాడు చివర్లో “మీ ఇండియన్స్ మంచి బుర్ర ఉన్నవాళ్ళే కదా!” అని జోడించి. ఇదంతా త్రిపాఠీ తో కూడా అదే కంపెనీలో పనిచేస్తూ, ట్రైనింగ్ కి వచ్చిన మరో డేవిడ్ అనే అమెరికన్ నిశితంగా గమనించాడని త్రిపాఠీ గారు చూసుకోలేదు. అయినా త్రిపాఠీ గారు చేసే పనేమిటో మనం చెప్పుకోలేదు కదూ. ఈయన చేసే పని సబ్బుల కంపెనీలో ప్రోజెక్ట్ మేనేజర్. ‘అనేక రకాల సబ్బులు ఎలా తయారౌతాయి, ఏం కలుపుతారు, కలిపిన అన్నింటినీ ఎలా ఏ షేపులో చేస్తారు, వాటిని ఎలా పేకింగ్ చేసి ఏయే షాపులకి పంపుతారు’, అనేవి మన త్రిపాఠీ గారి హయాంలోనే జరుగుతాయి. ఈయన మంచి బుర్రన్నవాడని, కంపెనీ వారు ట్రైనింగ్ కి పంపించారని చెప్పుకున్నాం కదా?

ట్రైనింగ్ లో త్రిపాఠీగారు ఎగిరే రంగులతో పాస్ అయ్యేరు. అంటే అదే లెండి – with flying colors. వెనక్కి వచ్చాక తన ప్రోగ్రాం మేనేజర్ దగ్గిరకి వెళ్ళి చెప్పాడు తన స్వంత ఐడియా. ఆయనకి ఆశ్చర్యం వేసింది మన కుర్రాడి ఐడియా విన్నాక. “చూద్దాం పద” అంటూ పేకింగ్ ఏరియాకి వెళ్ళారు.

సబ్బులు పూర్తయ్యాక పేక్ చేసేచోట సబ్బులని అనేక విధాలుగా అమరుస్తున్నారు. ఒక్కో సబ్బుని ఉల్లిపొర కాయితంతో చుట్టడం, అక్కడ ఈ చుట్టే పని చూడ్డానికి ఐదారుగురు పనిచేస్తున్నారు. అలా చుట్టిన సబ్బులని ఒక చిన్న పేకట్లో పెట్టాలి. ఈ పేకట్లు ముందుకెళ్ళాక పదో పన్నెండో కలిపి మరో పెద్ద పేకట్. వాల్ మార్ట్ లాంటి షాపులో అమ్మేదైతే ఆరు సబ్బులు, పెద్ద హోల్ సేల్ క్లబ్బులో అమ్మేదైతే పన్నెండు. అలా అనేకరకాల పేకెట్లు. అంటే ఒక్కో సబ్బుకి లోపల ఉల్లిపొర కాయితం, పైన చిన్న అట్టకాయితం ఇవన్నీ కలిపి మరో పెద్ద అట్ట పేకెట్టు. అయితే లోపల ఉల్లిపొర కాయితం దేనికీ, మనం అన్నీ బాగా పేక్ చేస్తున్నప్పుడు? ఆ ఉల్లిపొర కాయితం అక్కర్లేదు; సబ్బులు చిన్న చిన్నఅట్ట పేకెట్లలో పెడుతున్నాం; ఆ అట్ట మందం తగ్గించవచ్చు; ఆ అట్ట మీద ప్రింటింగ్ కూడా అనవసరం. సబ్బు వాసన, నాణ్యత తగ్గదు కస్టమర్ కొని సబ్బు బయటకి తీసేవరకూ.  సిక్స్ సిగ్మా అంటే ఇదేగా, వ్యర్థాలు తగ్గించుట కాదూ?

దీనికోసం మీటింగ్ పెట్టి అందరితో చర్చించారు. కంపెనీ ఓనర్ గారు అద్భుతం ఇది తప్పకుండా చేసి తీరుతాం, మిగతా పేకింగ్ లో కూడా అట్ట పెట్టెల మందం తగ్గించడం, ప్లాస్టిక్ మానేసి కాయితం వాడితే తక్కువ ఖర్చులో పోతుందా, పేకెట్ ఓపెన్ చేయకుండా సబ్బు వాసన బయటకి తెలిసేలా చేసే కాయితాలు చవగ్గా దొరుకుతాయా అనేవన్నీ రీసెర్చ్ చేసి తనకి స్వంతంగా రిపోర్ట్ పంపమని త్రిపాఠీగారికి ఆర్డర్ వేసాడు. ఇదంతా త్రిపాఠీతో పాటు ట్రైనింగ్ కి వచ్చిన డేవిడ్ గమనించాడు కూడా. త్రిపాఠీగార్ని అలా ఓనర్ గారు ఆకాశానికి ఎత్తేయడంతో కుళ్ళు పుట్టుకొచ్చింది. ఈ ఐడియాలు నిజంగా జరిగితే తనకంటే ముందు ఈ త్రిపాఠీ ప్రమోషన్ కొట్టేస్తాడు. ఇవన్నీ డేవిడ్ గారికి అసలే నచ్చలేదు. ఇదంతా కంపెనీలో మామూలే కదా? దానికి ఆయన ఏం చేయాలో ఎంచుకున్నాడు.

మీటింగ్ అయ్యాక డేవిడ్ తిన్నగా పేకింగ్ జరిగేచోటకెళ్ళి అక్కడ పనిచేసే పదిమందితో చెప్పాడు – "కాయితం పేక్ చేసేచోట ఇలా వ్యర్థాలు తగ్గిస్తారుట. అందువల్ల మీలో దాదాపు అందరికీ ఉద్యోగాలు పోతాయి. నేను విన్నది ఇది తర్వాత మీ ఇష్టం. మనకి యూనియన్ అదీ లేదు అందువల్ల ఏమీ చేయలేం. కాయితం వాడితే కంపెనీకి మహా అయితే ఏడాదికో మిలియన్ మిగలవచ్చు. కానీ మీరూ మీ కుటుంబాలూ రోడ్డుమీద పడవూ? ఏడాదికి ప్రస్తుతం కంపెనీకి పదిహేను మిలియన్ల లాభం ఉంది. దాంతో పోలిస్తే మిగిలే ఈ మిలియన్ ఏ మూలకీ? అదీగాక పదిమందిని తొలగిస్తే మరో మిలియన్ మిగలవచ్చేమో కంపెనీకి మీ జీతాలవల్ల. నేను ఇలా చెప్పినట్టు ఎవరికీ చెప్పకండేం?" ఇలా వాళ్ళకి పురి ఎక్కించి డేవిడ్ గారు జారుకున్నాడు ఇంటికి.

రెండు వారాలు పోయక ఓనర్ గారు ఓ నోటీస్ జారీ చేసారు – "పేకింగ్ లో ఇలా కాయితం చుట్టే చోట వ్యర్థాలు తగ్గిస్తున్నాం. త్రిపాఠీగారి ఐడియా అమోఘం" అంటూ. అయితే అక్కడ పనిచేసే పదిమందినీ ఏం చేస్తారో ఆ నోటీస్ లో లేదు. ఇలా ఉద్యోగాలు పోతాయి అని తనలో ఉహించుకుంటూ నిజమో కాదో తెలియకుండా జనాలందరికీ చేరవేసే వార్తలని కంపెనీలో 'గ్రేప్ వైన్' అనడం మనకి తెల్సిందే కదా? అలా డేవిడ్ గారు అందించిన గ్రేప్ వైన్ ఈ పదిమందినుంచి విస్తరించి కంపెనీలో మిగతా అందరికీ చేరింది. ఈ ఉద్యోగుల్లో కొందరికి కోపం, కొందరికి కలవరం, కొందరికి 'ఆ ఏం చేస్తాం లే' అనే నిర్లిప్తత. ఈ వార్తలన్నీ ఓనర్ గారి దగ్గిరకి వచ్చేసరికి ఆయన నవ్వుకున్నాడు ఎందుకంటే ఆయనకి ఈ పదిమందినీ ఉద్యోగాలలోంచి తీసేసే ఆలోచన లేనేలేదు. ఆయన బిజీగా ఉండడం వల్ల 'తర్వాత అందరికీ చెపుదాంలే, కంగారెందుకు' అని ఊరుకున్నాడు.

మర్నాడు సాయింత్రం లేట్ గా పనిచేసి త్రిపాఠీ గారు ఇంటికి రావడానికి అప్పటికే ఖాళీ అయిన పార్కింగ్ లాట్ లో కారు ఎక్కబోతూంటే ఒక ముసుగు వేసుకున్న వ్యక్తి గన్ తీసి ఆయన్ని కాల్చి ఎవరైనా వచ్చేలోపున మోటార్ సైకిల్ మీద పారిపోయేడు. తర్వాత ఎవరో త్రిపాఠీ గార్ని గుర్తించి ఆంబులెన్స్ పిల్చే సరికి ఈయన ప్రాణం పోయి చాలాసేపైంది. కంపెనీ ఓనర్ గారు వచ్చి చాలా విచారించాడు. మర్నాటి నుంచి ఆఫీసులో అనేక ఏంగిల్స్ లో ఉన్నవీ, పార్కింగ్ లాట్ లో

ఉన్న కెమేరాలనీ చూసారు గానీ మోటార్ సైకిల్ కి నెంబర్ లేనందువల్లా, ఆగంతకుడి ముసుగు వల్లా, ఎవరు కాల్చారో ఇథమిత్థంగా తెలియలేదు. పోలీసుల దగ్గిర హత్య కేసు మాత్రం మూసేయకుండా అలాగే ఉంది. మరో మూడు రోజులకి ఓనర్ గారు మీటింగ్ పెట్టాడు.

మీటింగ్ లో చెప్పిన విషయం ఇదీ –"మనకి ఎంతో సహాయం చేసిన త్రిపాఠీగారికి శ్రద్ధాంజలి. మీకు తెలియని మరి కొన్ని విషయాలు చెప్తున్నాను. పేకింగ్ చేసే చోట వ్యర్థాలు తగ్గించమని చెప్పాక అక్కడ పనిచేసే పదిమందినీ కంపెనీలో మరో చోట ఉద్యోగంలో పెడితే మరికొన్ని వ్యర్థాలు తగ్గుతాయి; దానివల్ల ఈ పది మందికీ ఉద్యోగం ఊడదు. వాళ్లకీ మంచి భవిష్యత్తు ఉంటుంది అని తాను చేయబోయిన పని చెప్పాడు. దానికి నేను కూడా ఒప్పుకున్నాను; మీకు అందరికీ మరో నోటీస్ లో చెపుదామనుకునేలోపునే ఇలా జరిగింది. ఎవరు ఈ పని చేసారో తెలియదు కానీ అలా చేసినవాళ్ళెవరో గ్రేప్ వైన్ విని నిజానిజాలు తెలుసుకోకుండా ఆయనని హత్య చేయడం దారుణం. ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కంపెనీ నిర్ణయించింది."

ఓనర్ గారు ఇలా అనగానే ఇదంతా మామూలే అన్నట్టూ త్రిపాఠీని హత్య చేసిన ఆగంతకుడితో పాటు అందరూ లేచి తప్పట్లు కొట్టారు.

నీతి: పూర్తిగా నిజానిజాలు తెలిసే వరకూ గ్రేప్ వైన్ అనేది పూర్తిగా నమ్మదగ్గది కాకపోవచ్చు.

Post your comments